క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో పార్వతీ దేవి



పాలకోడేరు: గురుపూర్ణిమ సందర్భంగా మోగల్లులోని శ్రీభద్రకాళీ సమేత భీమేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పెద్దాడ నారాయణశర్మ ఆధ్వర్యంలో పార్వతిదేవి అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. . స్వామివారు, అమ్మవార్లను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవీంద్ర, సర్పంచ్ చినకృష్ణమూర్తి

ఉండి: యండగండిలో ముంపునకు గురైన ప్రాంతాలను ఎంపీడీఓ రవీంద్ర ఆదివారం పరిశీలించారు. సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తితో కలిసి యండగండి లాకుల వద్ద, యనమదుర్రు డ్రెయిన్ వంతెన, జగనన్న లేఅవుట్ కాలనీ ప్రాంతాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక అధికారులకు సూచనలు చేశారు.

ఘనంగా గురుపౌర్ణమి

భీమవరం అర్బన్: గురుపౌర్ణమి వేడుకలను పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గొల్లవానితిప్పలో బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

కిటకిటలాడిన బాబా ఆలయాలు

కాళ్ల: సీసలి, దొడ్డనపూడి గ్రామాల్లో బాబా ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీసలిలో బాబావారికి రూపాయి కాయిన్‌లు కలిగిన కలశాలతో మూడు వందల మంది భక్తులు అభిషేకాలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన మేడేపల్లి మల్లికార్జున, పావని దంపతుల సహకారంతో అన్నసమారాధన చేశారు.

గురువులకు సత్కారం

ఆకివీడు: గురుపౌర్ణమి సందర్భంగా దత్త క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎక్సైజ్ సెబ్ సీఐ కాత్యాయిని మాట్లాడుతూ జన్మనిచ్చి, పెంచి పోషించిన తల్లిదండ్రులే ప్రథమ గురువులన్నారు. ఉపాధ్యాయుడు, జ్యోతిష్య పండితులు వేమూరి వెంకట రామ శాస్త్రి, వేద అధ్యాపకులు లింగాల దుర్గాప్రసాద్ ఘనాపాఠీలను సత్కరించారు.

కోలాట కళాకారులకు సత్కారం

ఉండి: ఉండిలోని దత్తాసాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా కోలాట కళాకారులను ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. మానవత ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ముగునూరి శివరామరాజును సత్కరించారు.

అన్నసమారాధన

భీమవరం: భీమవరం వన్‌టౌన్‌లోని శ్రీప్రసన్న షిరిడీ సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనను ఎస్సై మాణిక్యమ్మ ప్రారంభించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఆర్ అప్పాజీ, నీలాతి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఏటా గురుపౌర్ణమి నాడు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

ముంపు బాధితులకు ఆహార పొట్లాల అందజేత



బాధితులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: అన్నార్తులను, ముంపు బాధితులను ఆదుకోవడమే మానవ ధర్మమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. 2, 38, 39 వార్డుల్లోని ముంపు బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతలు రామకృష్ణంరాజు, గోపాలరాజు సహకారంతో ఆహార పొట్లాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రీవెంకట సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తిరుమలరావు ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు.

సారె సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): గునుపూడి గ్రామదేవత శ్రీ ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్లకు శ్రీఉమాసోమేశ్వర నగర్ కుటుంబ సభ్యులు ఆషాఢ సారె సమర్పణలో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొన్నారు.

150 ఎకరాల్లో మునిగిన వరి నాట్లు

భీమవరం అర్బన్: వరి నారుమడులు ముంపు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. గునుపూడి, కొవ్వాడ అన్నవరం, చినఅమిరం గ్రామాలలో ఆదివారం వరి నారుమడులను ఏవో పరిశీలించారు. 100 ఎకరాలకు సరిపోయే వరి నారు, 150 ఎకరాలలో వరి నాట్లు వరద నీటికి మునిగిపోయినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. నారుమడులు మునగకుండా గట్ల ఎత్తు పెంచుకోవాలని రైతులకు సూచించారు.

వర్షం తగ్గినా వీడని ముంపు



ఉండిలో ఇరిగేషన్ కార్యాలయం వద్ద కాలువ గట్టు మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు



యండగండిలో నీట మునిగిన వైఎస్సార్ కాలనీ

- ఎగువ నుంచి భారీగా వచ్చి చేరుతున్న వరద
- ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్లు, కాలువలు
- ముంపు చేల నుంచి తొలగని వరద నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న వెంకయ్య వయ్యేరు పంట కాలువ



ఉప్పులూరులో మునిగిన వరి చేలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జేడీఏ వెంకటేశ్వరరావు, ఏఓ సంధ్య

ఉండి: ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలకు కాస్త విరామం వచ్చినా ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో పలు డ్రెయిన్లు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ఆదివారం చిరుజల్లులు మినహా వర్షం కురవకపోవడంతో ఊపిరిపీల్చుకున్న ప్రజలు డ్రెయిన్‌లు ఉగ్రరూపం దాలుస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి ఉండి కాలువ ఉగ్రరూపంతో కాలువ పరిసరాల్లోని గ్రామాలు వణికిపోయాయి. ముఖ్యంగా యండగండి, ఎన్నార్పీ అగ్రహారం, ఉండి గ్రామాల్లో కాలువ నీరు గట్లపైకి రావడంతో ఇరిగేషన్, పంచాయితీ అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు పోలీసులు కూడా రాత్రి సమయంలో పర్యవేక్షించారు. ఆదివారం ఉండి ఇరిగేషన్ కార్యాలయం ఎదురుగా ఉండి కాలువకు పెద్ద గండి పడింది. అయితే ఈ వరదనీరు పక్కనే ఉన్న బొండాడ డ్రెయిన్‌లోకి మళ్లడం ఊరటనిచ్చింది. అలాగే ఉండి తోట ఎస్సీ ఏరియాలోనికి శనివారం రాత్రి పొంగి వచ్చిన కాలువకు అధికారులు, స్థానికుల సహాయంతో ఇసుక బస్తాలు అడ్డుకట్టగా వేశారు. అయితే ఆదివారానికి ఇసుకబస్తాల నుంచి కూడా నీరు పొంగి ప్రవహించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే యండగండిలో ఉండి కాలువ ఉప్పొంగడంతో వైఎస్సార్ కాలనీ ముంపునకు గురైంది. పూర్తిస్థాయిలో ఉండి కాలువ గట్లు ఎత్తు చేస్తేనే ముంపు ముప్పు ఉండదని స్థానికులు చెబుతున్నారు.

ఉధృతంగా వెంకయ్య వయ్యేరు

ఆకివీడు: వెంకయ్య వయ్యేరు పంట కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. 2,700 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం ఉన్న వెంకయ్య వయ్యేరు కాలువలోకి సుమారు 2,600 క్యూసెక్కుల నీరు అదనంగా వచ్చి చేరుతుండటంతో వివిధ ప్రాంతల్లో గట్లను తాకుతూ నీటి ప్రవాహం ఉంది. దీంతో పల్లంగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదం పొంచి ఉందని రైతులు, ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతన్నారు. వెంకయ్య వయ్యేరు కాలువలో అదనపు నీటిని చినకాపవరం లాకుల ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని ఉప్పుటేరులోకి వదిలివేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎగువ నుంచి వరద పోటెత్తడంతో చినకాపవరం లాకుల వద్ద ఆరు షట్టర్లు ఎత్తివేశారు. గుమ్ములూరు వంతెన వద్ద, కోళ్లపర్రు వంతెన వద్ద, ఆకివీడు వంతెన వద్ద చెత్త, గుర్రపుడెక్క మేటవేయడంతో ప్రవాహానికి ఆటంకంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే గుమ్ములూరు, అప్పారావుపేట, కోళ్ళపర్రు, ఆకివీడు ఆయకట్టులోని పంట పొలాల్లో మూడడుగుల లోతున నీరు నిలిచి ఉంది. ఇది మరింత పెరిగితే నారుమడులు, నాట్లు వేసిన ప్రాంతంల్లో కుళ్లిపోయే అవకాశాలు ఉన్నాయి.

నీరు తగ్గిన వెంటనే నారుమడులు వేసుకోండి

ఉండి: వరి చేలు ముంపుబారి నుంచి బయట పడిన వెంటనే రైతులు నారుమడులు వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. ఆదివారం యండగండి, ఉప్పులూరు గ్రామాల్లో ముంపునకు గురైన వరి చేలను, యండగండి మీడియం డ్రెయిన్‌ను ఏఓ బి.సంధ్యతో కలిసి జేడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిచేలల్లో వరద నీరు తగ్గిన వెంటనే స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 వంగడాలను వేసుకోవాలని సూచించారు. యండగండి మీడియం డ్రెయిన్ కూడా పరిశీలించారు. డ్రెయిన్ పరిధిలోని 700 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, మరమ్మతులు చేపట్టి రైతులను కాపాడాలని రైతులు అధికారులను కోరారు. అలాగే నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు అందజేయాలని కోరారు.

మోగల్లుకు పొంచి ఉన్న ముంపు ముప్పు

పాలకోడేరు: మోగల్లు గ్రామం గోస్తనీ డ్రెయిన్ పక్కనే ఉండటంతో గ్రామానికి వరద ముప్పు పొంచి ఉంది. ఈ డ్రెయిన్ యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తుంది. యనమదుర్రు డ్రెయిన్‌లో నీటిమట్టం ఇంకా పెరిగితే గోస్తనీ నీటి మట్టం పెరిగి మోగల్లు ముంపునకు చేరువయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. అలాగే మోగల్లులో విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి ముంపు నీరు చేరింది. గ్రామానికి ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రతి ఏడాదీ వరద సమయంలో ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. తణుకు నుంచి సిబ్బందిని తీసుకువచ్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధించేందుకు కసరత్తు చేస్తున్నారు.

పెరుగుతున్న యనమదుర్రు ఉధృతి

భీమవరం అర్బన్: ఎగువ నుంచి వరదతో యనమదుర్రు డ్రెయిన్‌కు వరద నీరు పోటెత్తుతోంది. యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, దెయ్యాలతిప్ప, గూట్లపాడు, నాగిడిపాలెం, తోకతిప్ప, లోసరి గ్రామాల మీదుగా యనమదుర్రు డ్రెయిన్ ప్రవహించి మొగల్తూరు మండలంలోని పాతపాడు వద్ద ఉప్పుటేరులోని సముద్రపు మొగలో కలుస్తుంది. అయితే పౌర్ణమి కారణంగా సముద్రపు పోటు ఎక్కువగా రావడంతో ఉప్పునీరు ఎగదన్నడంతో యనమదుర్రులోని వరదనీరు దిగువకు ప్రవాహం వేగంగా లాగడం లేదని రైతులు చెబుతున్నారు. సుమారు 15 వేల ఎకరాలకు పైగా వరి చేలు, రొయ్యలు, చేపలు చెరువులు ఈ డ్రెయిన్ ఆనుకుని ఉన్నాయి. యనమదుర్రు డ్రెయిన్‌కు అధికారులు రెండో ప్రమాద హెచ్చరికలు జారీ చేయడంతో అధికారులు, రైతులు అప్రమత్తమై డ్రెయిన్ నుంచి నీటిని ఎగదన్నకుండా తూములను కట్టివేశారు. దీంతో కొద్దిమేర వరద నీరు పంటచేలల్లోకి వరదనీరు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల యనమదుర్రు డ్రెయిన్‌లో నుంచి మురుగు తూముల ద్వారా వరదనీరు గ్రామాల వైపు రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ముంపును తట్టుకునే వంగడాలను ఎంపిక చేసుకోవాలి

వీరవాసరం: సార్వాలో వరి సాగులో ముంపును తట్టుకునే వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలని ఏఓ ఎం.బిన్నిబాబు రైతులకు సూచించారు. ముంపునకు గురైన నారుమడుల్లో అదనపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. నారుమడి వేసిన ఏడు రోజుల నుంచి 30 రోజుల మధ్యలో నారు ఐదు రోజులు కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. మునిగిన నారుమడి నుంచి నీరు ఐదు రోజులలోపు నీటిని పూర్తిగా బయటికి తీసి వేసిన తర్వాత ఐదు సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. పిలకల దశలో వరి పంట మునిగితే నీరు బయటకు పోయిన తర్వాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని సూచించారు.



వీరవాసరంలో ముంపులో ఉన్న వరిచేలు



వీరవాసరంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ బిన్నిబాబు



ఉధృతంగా ప్రవహిస్తున్న యనమదుర్రు డ్రెయిన్



గొల్లవానితిప్పలో యనమదుర్రు డ్రెయిన్ నుంచి మురుగు కాలువల ద్వారా గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న వరద నీరు

మావుళ్లమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలి



మావుళ్లమ్మ అమ్మవారికి హారతి ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



అమ్మవారి గరగను తలపైకి ఎత్తుకున్న గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశం చౌక్) : ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలని, దైవ కార్యక్రమాల్లో పాల్గొన్నాలని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆషాఢమాసం గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని 20వ వార్డులో శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 9వ వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాఢమాసం సందర్భంగా భీమవరం ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి జాతరను పట్టణంలో వాడవాడలా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం గొప్ప దైవ కార్యక్రమం అన్నారు. శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మెంటే బలరాం, గోపిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, గ్రంధి నానాజీ, మానే తేజ, పాపోలు ఏడుకొండలు, నరహరిశెట్టి అబ్బులు, అందే రాము, మోటుపల్లి ప్రసాద్, ఇళ్ల రాధా, పాపోలు ప్రసాద్, మెరుగు సుబ్బారావు పాల్గొన్నారు. 12వ వార్డులో ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల 2వ జాతర మహోత్సవంలో గ్రంధి రవితేజ పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గెల్లు సంజీవరాజు, మల్లుల వెంకటేశ్వరరావు, దొడ్డిపట్ల హనుమంతరావు, పటాన్ల సతీష్, రేవురి వెంకటేశ్వరరావు, చెలపా శీను, పేరిచర్ల తాతాజీ, జాన్, ఈడ నాని, వంశీ, సునీల్ స్టాలిన్, ఎనీష్ పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు సారెల సమర్పణ



చినకాపవరంలో పల్లాలమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు



ఆకివీడులో మారెమ్మ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న తెలగపాముల కులస్తులు

ఆకివీడు: ఆషాఢ ఆదివారాన్ని పురస్కరించుకుని గ్రామ దేవతలైన అమ్మవార్లకు పలు చోట్ల సారెలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆకివీడులోని గంగానమ్మ కోడు ప్రాంతంలోని మారెమ్మ అమ్మవారికి తెలగపాముల కులస్తులు బోనాలు సమర్పించారు. చినకాపవరంలో మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు నందమూరి సత్యవతి ఆధ్వర్యంలో మహిళలు పల్లాలమ్మ, అలివేలుమంగమ్మ, పద్మావతమ్మ, పార్వతీదేవి అమ్మవార్లకు చీరలు, గాజులు, పసుపు కుంకుమ సమర్పించారు. గ్రామంలో ప్రదర్శనగా ఆయా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దింటి అమ్మవారి ఆలయంలో లలితా మహిళా మండలి ఆధ్వర్యంలో వివిధ వంటకాలు, స్వీట్లు, పండ్లు, పూలు, చీరలతో సారె సమర్పించారు. అనంతరం ఊరేగింపుగా మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు.



ఆకివీడులో భీమేశ్వరస్వామి ఆలయంలో సారెను సమర్పిస్తున్న మహిళలు

ఉండిలో సీతమ్మ తల్లికి సారె

ఉండి: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఉండికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు (హెడ్) దంపతులు ఉండిలోని శ్రీరామక్షేత్రంలో కొలువైన సీతమ్మ అమ్మవారికి 60 రకాల పిండివంటలు, చీరలు, జాకెట్లు, గాజులు తదితరాలతో సారె సమర్పించారు. అలాగే జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి, ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గ పలువురు మహిళా భక్తులు సారెను సమర్పించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



ఉండిలో సీతమ్మవారికి సమర్పించిన సారె

పాలిథీన్‌తో నారుమడి సంరక్షణ



పాలిథీన్ పేపర్ రోల్



గుమ్ములూరులో నారుమడి గట్లపై వేసిన పాలిథీన్ పేపర్ రోల్



ఆకుమడుల్లో ముంపు నీటిని కారెంతో బయటకు తోడుతున్న రైతు భాస్కరరావు

ఆకివీడు: భారీ వర్షాలకు ముంపునకు గురవుతున్న నారుమడులను రక్షించుకునేందుకు రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పలు చోట్ల గట్లను పటిష్టం చేసుకోవడంతో పాటు కారెంలతో ముంపు నీటిని తోడుతున్నారు. ఇదిలా ఉండగా గుమ్ములూరు గ్రామంలోని రైతు పాలడుగుల భాస్కరరావు వినూత్న రీతిలో పాలిథీన్‌తో నారుమడిని రక్షించే చర్యలు చేపట్టారు. నారుమడి గట్టుపై పాలిథిన్ పేపర్ రోల్‌ను వేసి ఆరు అంగుళాల మేర లోతులో మట్టితో పూడ్చారు. గట్టుపైన కవర్ కదలిపోకుండా మట్టిని వేసి ముంపు నీరు నారుమడిలో ప్రవేశించకుండా నిలిచిపోయింది. అలాగే నారుమడిలో అదనంగా ఉన్న నీటిని కారెంతో బయటకు తోడి వేశారు. రూ.100 ఖరీదైన పాలిథీన్ పేపర్ రోల్‌ను రైతు వినియోగించారు. ముంపు నీరు తొలగితే నాట్లు వేస్తామని రైతు భాస్కరరావు చెప్పారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాల సరఫరా

భీమవరం అర్బన్: సబ్సిడీపై గడ్డి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇవ్వనున్నట్లు మండల పశువైద్యాధికారి పి.పుండరీబాబు ఆదివారం చెప్పారు. పశువులను పోషించే రైతులు, పశుపెంపకం దారులు రైతు భరోసా కేంద్రాల్లోని పశుసంవర్ధక శాఖ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

భీమవరం అర్బన్: తండ్రి మెల్లా కృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారులు మెల్లా రాంబాబు, బాలాజీ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉపసర్పంచ్ తిరుమల విజయరామ్ అన్నారు. యనమదుర్రు గ్రామంలో మెల్లా కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా కుమారులు రాంబాబు, బాలాజీ ఉచిత మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం రక్తదానం ప్రాముఖ్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు.